
మనసు చలించి విపరీతమైన నిర్ణయానికి వచ్చినా ఏ అరక్షణంలోనో జ్ఞానోదయం కలిగి మబ్బులు తొలగి స్వసుఖానికి ఫుల్‌స్టాపు పెట్టి బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచించిన ఒక ఇల్లాలి ఇతివృత్తం

# తెరతొలగింది

యం. సత్యవతి



రైలు కదిలింది.

అప్పటి వరకు దడదడా కొట్టుకుంటూ వున్న శశిరేఖ గుండె కొంత సద్దుమణిగింది.

ఆమె మళ్ళీ ఆ స్థితిలోకి జారుకోక ముందే కృష్ణ మాటల్లోకి దించాడు.

కృష్ణ మాటలు మొదలెడితే వాటికి అంతమంటూ వుండదు. ఏ విషయాన్ని తీసుకున్నా దానిమీద అనర్గళంగా, ఎన్ని గంటలైనా మాట్లాడగలడు.

అతని మాటల్లోకి రాని విషయమంటూ వుండదు.

కృష్ణ మాట్లాడుతూ వుంటే శశిరేఖ మంత్రముగ్ధలా వింటూ వుంటుంది.

కానీ ఈ రోజు శశిరేఖ అతని మాటల్ని శ్రద్ధగా వినడంలేదు. ఆమె పెదవులపై మధ్య మధ్య అలవోకగా కనీ కన్పించని మెత్తని దరహాసమూ లేదు.

ఆమె అన్యమనస్కంగా, అలజడిగా, ఆందోళనగా వుంది. దేన్నో తిరిగి తిరిగి ఆలోచిస్తూ వుంది.

ఆమె ఆలోచనల్ని చెదరగొడ్తూ కృష్ణ మరింత ఉత్సాహంగా, ఉల్లాసంగా కబుర్లు చెప్తూ వున్నాడు.

అతను చెప్పేది వింటూ వున్నట్టుగా అప్పుడప్పుడు తల క్రిందకూ, పైకి కదిలిస్తూ వుంది.

అతను మాట్లాడేదేమిటో ఆమెకు విన్పించడంలేదు. మనస్సు మనస్సులో లేదు. అంతా గందరగోళంగా, భయంగా వుంది. అంతులేని ఆలోచనలతో తలలో నుంచి ఆవిర్లు వస్తూ వున్నట్లుగా వుంది.

ఇంతలో ఓ స్టేషన్ రావడం, రైలు ఆగడం జరిగింది.

ప్లాట్‌ఫారం మీద జనం అటూ యిటూ హడావిడిగా పరుగెత్తుతున్నారు. అరవై సంవత్సరాల ముసలమ్మ యిద్దరు పిల్లలతో కంపార్టుమెంటులోకి ప్రవేశించింది.

శశిరేఖ ప్రక్కన ఖాళీగా వుండడం చేత ఆమె ప్రక్కనే వచ్చి కూర్చుంది.

ఇద్దరు పిల్లలూ ముసలమ్మను ఆనుకొని నిలబడ్డారు.

పిల్లలిద్దర్నీ ఆప్యాయంగా ప్రక్కన చేర్చుకొని ప్రేమగా వాళ్ళ తలలు నిమిరింది.

పిల్లవాడికి ఆరేళ్లు. పాపకు నాలుగేళ్ళు వుంటాయి. పిల్లలిద్దరూ ముత్యాల్లా వున్నారు.

రైలు కదలగానే యిద్దరూ కిటికీ దగ్గర చేరి తమ చూపు అందినంత వరకు దృష్టిని సారించి "నానమ్మా అదేంటి? ఇదేంటి?" అనే ప్రశ్నల వర్షాన్ని కురిపిస్తూ వున్నారు.

ముసలమ్మ ఎంతో ఓపిగ్గా పిల్లలడిగిన అన్ని ప్రశ్నలకూ తనకు తెలిసిన మేరకు సమాధానం చెప్తూనే వుంది.

శశిరేఖ దృష్టి పిల్లలపై పడింది.

ఆమె అనుకోకుండానే "కూతురు పిల్లలా" అంది.

"కొడుకు పిల్లలు" అంది ముసలమ్మ.

"మీ దగ్గర బాగా చనువుగా వుంది. తల్లిని వదిలి బాగానే వున్నారు" అంది.

"తల్లి లేదమ్మా. చనిపోయింది" అంది ముసలమ్మ బాధగా.

"అయ్యో. ఎలా చనిపోయింది?"

"బుద్ధిలేక చనిపోయిందమ్మా"

* *

"చదువులేందా?"

"కాదు. బి. ఎ. చదివింది. ఏం లాభం? దాని చదువు ఈ పిల్లల గురించి కొంచెం కూడా ఆలోచించలేదు" అంది.

శశిరేఖ మాట్లాడడానికి సాహసించలేదు.

ఏదేశ స్టాంపులు కావాలా?

Foregin countries కి చెందిన 100 అందమైన (All large beautiful) Stamps కావాలంటె Rs 17/-, 50 large అయితే Rs 9/-, 20 large అయితే Rs 4/- పంపండి. 100 Allworld (చిన్నవి) కావాలంటే Rs 4/-. కావలసినవారు డబ్బు M.O ద్వారా పంపండి.

Pricelist ఉచితం.

K. T. B. SAPROO, 541-B
Ramachandrapurem (P.o)
Hyderabad-500 032.

జ్యోతి పబ్లిసిటీ రిజి. నెం. 2/77-78

పోటీ నెం. 3 చీరల లాటరీ ఫలితం

1. జి సామ్రాజ్యం, నాగర్ కర్నూలు, 2. పి. ...కుమార్, నగరం, 3. యమ్. సీతా లత. వరంగల్. 4. యస్. గోపాలరెడ్డి కడప. 5. టి. చలపతిరావు, బరహంపూర్.

*  *  *

కేవలం రు. 5తో రెండు నెలలలో రు. 10,000 ... సంపాదించుకుంటే, వివరాలకు పూరాలకు వెంటనే 11-11-77నాటికి 5 రు.లు ఈ క్రింది అడ్రసుకు M. O. చేయండి.

M/s Jyothi & Co:
15/17, Guru Nanak Road,
Durgapur-713204, (W. B.)

వార్తలకు, వ్యాఖ్యలకు

"ఆంధ్ర జ్యోతి"

దిన పత్రికనే చదవండి.

ఎందుకు గుంభనంగా
ఆ చెడురోజులతో బాధపడతారు?



శ్రీమతి పి. దేవి యొక్క కుమారి (టాబ్లెట్లు) గూర్చి మీ స్నేహితులను, బంధువులను అడగండి. సున్నితమైన, హాని చేయని ఈ ఆయుర్వేదిక్ మందు స్త్రీలచే 40 సం॥ల పైగా వాడబడుతున్నది. ఇప్పుడు ప్రతి మందులషాపులోను లభిస్తుంది.

Mild రు. 7/-   Forte రు. 10/-

తయారుదారులు:

SOLAR DRUG Co. (AJ)
9/3, C. F. Lane, CALCUTTA-40

అయినా ముసలమ్మే మళ్ళీ మొదలెట్టింది:

"పిల్లలు పుట్టిన తర్వాత ఆడది కొంత సహనాన్ని అలవర్చుకోవాలి. వాళ్ళకోసం కొన్ని సుఖాలను వదులుకోవాలి. సంసారంలో ఎదురయ్యే కొన్ని కష్టాలను, - యిష్టం లేని కొన్ని విషయాలనూ భరించాలి. - వాడు - మా గాడిద; అదే నా కొడుకు, ఈ పిల్లల తండ్రి. ఆఫీసులో తన దగ్గర ప చేసే అమ్మాయి అందానికి ఆకర్షితుడయ్యాడు.

విషయం తెలిసిన తర్వాత యింట్లో క్షణం శాంతి లేదు.

దానివంక చూడొద్దనీ, దాంతో తిరగొద్దనీ ఈ పిల్లల తల్లి పంతం.

దాన్ని చూడకుండా క్షణం వుండలేనని మా దౌర్భాగ్యుడు.

వాడిని ఎన్నో విధాల మందలించి, వినడని తెలియగానే, తల్లీ, నీవు కొంత ఓర్పు వహించు. వాడు మారుతాడు. కాలం వాడ్ని మారుస్తుంది. యిలాంటి ప్రేమలు ఎల్లకాలం నిలవవు అని చిలకకు చెప్పినట్లుగా చెప్పాను. అయినా వినలేదు. తిండీ మానేసింది. మాట్లాడడం మానేసింది. లోలోన కుమిలిపోయింది. కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. అయినా వాడు మారలేదు. చివరికి ఏమనుకున్నదో-ఏం తిన్నదో-ఓ రోజు వుదయానికి చనిపోయి వుంది.

ప్రాణాలు తీసుకొని తన మనస్సుకు శాంతిని కొనుక్కొని వెళ్ళిపోయింది.

ఆర్నెల్లు తిరక్కుండానే, ఆఫీసులోని అమ్మాయి మావాడి రెండో భార్యగా మా యింట్లో అడుగు పెట్టింది.

అప్పుడు ఇదో వీడికి రెండేళ్ళు. దీనికి సంవత్సరం.

అమ్మా, అమ్మా అని ఏడ్చే పిల్లల్ని సముదాయించాలి. వీళ్ళ పోషణ చూడాలి. పైగా పిల్లల్ని గారాబంచేసి పాడుచేస్తు వున్నానని కొడుకూ క్రొత్త కోడలు గొణిగే సణుగుడు భరించాలి. నన్ను బంగారంలా చూసే చిన్న కొడుకు వున్నా. నోరులేని ఈ బిడ్డల్ని-వీళ్ళవైపు కన్నెత్తి చూడని ఆ క్రొత్త కోడలును నమ్మి ఎలా వెళ్ళగలను? అయినా ఆ మనిషిని అని లాభం ఏమిటి తల్లీ. తొమ్మిది నెలలు మోసి కన్న తల్లి ఈ పిల్లలు ఏమౌతారని ఆలోచించక దాని దారి అది చూసుకొని వెళ్ళిపోయే....... నా ఖర్మ యిదంతా నా నుదుట వ్రాసివుంది. ఎలా తప్పించుకుంటాను? ఈ రెక్కలలో శక్తి వున్నంత వరకు చూస్తాను. ఆ తర్వాత వాళ్ళ అదృష్టం ఎలా వుంటే అలా అవుతుంది. కూతురు దగ్గర నెల రోజులు వుండి మళ్ళీ ఆ కొంపకే చేరుతున్నాను తల్లీ" అంటూ ముగించింది ముసలమ్మ.

కృష్ణ ముసలమ్మ వైపు విసుగ్గా అసహనంగా చూశాడు.

శశిరేఖ చూపులు ఎక్కడో వున్నాయి. ఆమె పెదవులు తడి ఆరిపోయాయి.

మెదడు దిమ్మెక్కిపోయింది.

మనస్సు మంచులా గడ్డకట్టింది.

కృష్ణ శశిరేఖను మాటల్లో పెట్టడానికి ప్రయత్నించలేదు. అతను ప్రక్కకు తిరిగి కళ్ళు మూసుకున్నాడు. రెండు రోజులుగా నిద్రలేక, అలసి వుండడంవల్ల, కళ్ళు మూసుకున్న కొద్ది నిమిషాల్లోనే అతను నిద్రలోకి జారిపోయాడు.

మరో స్టేషన్‌లో ట్రెయిన్ ఆగీ ఆగగానే శశిరేఖ మెల్లగా లేచి తలుపు దగ్గరికి వెళ్ళి నిలబడింది.

రైలు కదులుతూ వుండగా, నెమ్మదిగా క్రిందకు దిగింది.

రైలు వేగాన్ని పుంజుకుంది.

కృష్ణ ఆ వేగంలోనే వున్నాడు.

శశిరేఖ తన గమ్యం చేరుకోవడానికి స్టేషన్ ప్రక్కనేవున్న బస్‌స్టాండ్ వైపు నడిచింది.

తను బయలుదేరిన స్థలానికి బయలుదేరబోతూ వున్న బస్సులో వెళ్ళికూర్చుంది.

బస్సు కదిలింది. ఆమె ఆలోచనలు కూడా కదిలాయి.

కృష్ణతో పరిచయం బస్సులోనే అయింది.

నెల తిరక్కుండానే ఆ పరిచయం. ఒక్కరోజు చూడకుండా వుండలేం అనే స్థితికి తీసుకొని వచ్చింది. కృష్ణ మాటల గారడీలో పడి మోసపోయానా అని ఎన్నోసార్లు ఆలోచించింది. కానీ ఏదో ఆకర్షణ అతని వైపు బలంగా లాగుతుంది. దాన్నుంచి బయటపడడానికి శతవిధాలా ప్రయత్నించి విఫలురాలైంది. పెళ్ళి జరిగి ఎనిమిది సంవత్సరాలైంది. ఇద్దరు బిడ్డలకు తల్లి అయింది. కాని భర్త సమక్షంలో ఏనాడూ పొందని వింత అనుభూతి, స్పందన, హాయి, కృష్ణను తలుచుకున్న క్షణంలో, శరీరాన్నంతటినీ చుట్టేస్తాయి.

మనిషి జీవితంలో ఈ అనుభూతి, ఈ ఆనందం, ఒక్క క్షణం లభించినా చాలు. కృష్ణను విడిచి బ్రతకడం కష్టం. అతనితోటి జీవితం ఎన్నో నిందలకు, మరెన్నో కష్టాలకు గురికావచ్చు. ఈ నాటి ఈ ఆకర్షణ కొంత కాలానికి చప్పగా చల్లారి

పోవచ్చు. అయినాసరే అతనితోటి జీవితం ఒక్క రోజైనా.. ఒక్క క్షణమైనా చాలు అనుకుంది.

ఇంక లాభంలేదు. ఒకర్ని వదలి ఒకరం వుండలేము అని కృష్ణ అనగానే - కృష్ణతో బయలుదేరడానికి ఒక క్షణం కూడా వెనకాడలేదు. ఆ క్షణాన భర్తగానీ- పిల్లలుగానీ జ్ఞాపకంరాలేదు. నేను లేనప్పుడు నా స్థానంలో వారికి మరో స్త్రీతో సాహచర్యం అవసరం. ఆమెకు పానకంలో పుడకలుగా ప్రత్యర్థులుగా నా పిల్లలు కన్పిస్తారు. అది సహజం.

సవతితల్లి చీదరింపులతో. చివాట్లతో. చీపురు దెబ్బలతో పెరిగే పిల్లలు సవతితల్లి మీద పగా ద్వేషాన్ని పెంచుకుంటూ పెరుగుతారు.

తల్లీ తండ్రి ప్రేమలో అపురూపంగా పువ్వుల్లా పెరగాల్సిన వయస్సులో పగా, ద్వేషం, అనాదరణతో, ఈసడింపులతో పెరిగి పెద్ద వాళ్ళయేసరికి కఠినంగా, క్రూరంగా మారుతారు.

ప్రేమ, మమత అనే మాటలు వున్నాయని చెప్పినా నమ్మని స్థితిలోకి వస్తారు.

బిడ్డల్ని ఆ స్థితిలో బ్రతకమని వదలడం కన్నా నేను ఆశించిన జీవితాన్ని వాళ్ళ కోసం త్యాగం చేయడమే వుత్తమం, అని అనుకోగానే శశిరేఖ మనస్సు తేలికగా దూది పింజలా తేలిపోయింది.

ఆమె బస్సుదిగి ఇల్లు చేరింది.

వూరు వెళ్ళిన భర్త యింకా వచ్చి వుండడు అని అనుకోగానే శశిరేఖలో కొద్దిగా ధైర్యం చోటుచేసుకుంది.

ఆమె మెల్లగా తలుపుమీద కొట్టింది.

రాత్రంతా ఇద్దరు పిల్లలతో నానా అవస్థా పడిన అత్తగారు వచ్చి తలుపులు తీసి యిల్లు పట్టించుకోకుండా తిరిగే కోడలు మీద గయ్యిమని లేచారు.


ఇంకెప్పుడూ ఇలా స్నేహితుల యిండ్లలో వుండిపో నత్తయ్యా, ఈ ఒక్కసారికి క్షమించండి, అంటూ బెడ్ రూంలోకి నడిచింది.

అమ్మ లేదు, యిక మనిద్దరమే ఒకరి కొకరం తోడు అన్నట్లుగా ఒకడి మీద ఒకడు చేయీ కాలూ వేసి పడుకున్నారు పిల్లలు.

ఆ దృశ్యం చూడగానే శశిరేఖ హృదయం ద్రవించింది.

మెల్లగావెళ్ళి ఇద్దరి పిల్లల మధ్య చేరి ఇద్దరీని గుండెలమీదకు చేర్చుకుంది. ★

# శ్రీ ఆర్. కె. రావుగారికి సన్మానం



విజయనగరం ఆర్యవైశ్య సంక్షేమసంఘ భవనంలో శ్రీ ఆర్. కె. రావుగారిని ప్రముఖ కళాపోషకులు శ్రీ పి. వి. రమణయ్యగారు నూతనవస్త్రాలతో సత్కరిస్తున్న దృశ్యం.

ఏకపాత్రాభినయానికి మారు పేరుగా నిలిచిన ప్రముఖ నటుడు శ్రీ ఆర్. కె. రావు గారికి సెప్టెంబరు యిరవై ఏడవ తేదీన విజయనగరం కళా పోషకులు వారి షష్టి పూర్తి సందర్భంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. సభకు శ్రీ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీ యుతులు విద్వాన్ విశ్వం, దాశరధి. ఆత్రేయ, నేరెళ్ళ వేణుమాధవ్, గొల్లపూడి మారుతీరావు. దేవత సుబ్బారావు. జి. రామదాసు, జి. ఆర్. రావు, డి. యల్. సత్యనారాయణ ఆ సభలో ప్రసంగించారు. శ్రీ ఆర్. వి. చలం, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. టి. వి. కె. శాస్త్రి సన్మాన పత్రాన్ని చదివారు. సన్మాన సంఘం తరపున గోపాలరెడ్డిగారు అయిదు వేల రూపాయల చెక్కును రావు గారికి బహూకరించారు. జీవిత విశేషాలతో ప్రచురించిన ప్రత్యేక సంచికను జూట్ మిల్ జనరల్ మేనేజర్ సోని ఆవిష్కరించారు.

సభానంతరం అష్టావధానం. లలిత సంగీత కచేరి జరిగాయి.